


'లడ్డూ బరువు'పై అపోహలొద్దు : టిటిడి

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారి లడ్డూ బరువు, నాణ్యత విషయంలో భక్తులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని, లడ్డూ సగటు బరువు కన్నా ఎక్కువగానే ఉందని తూనికలు,కొలతల డిప్యూటీ కంట్రోలర్ అధికారి దయాకర్ రెడ్డి తెలిపారు.. శుక్రవారం ఉదయం శ్రీవారి లడ్డు విక్రయాశాలను తూనికలు కొలతల విభాగం అధికారులు,



సిబ్బంది కలిసి పరిశీలించారు. కౌంటర్ల వద్ద లడ్డూల నాణ్యతను పరిశీలించి తూకం వేశామని, 160 నుండి 194 గ్రాముల బరువు లడ్డూ తూకం వచ్చిందన్నారు. ఇటీవల సోషల్ మీడియాలో లడ్డూ బరువు తక్కువగా ఉందంటూ ఓ భక్తుడు వీడియో వైరల్ చేయడంతో లడ్డూ విక్రయ కేంద్రాన్ని పరిశీలించినట్లు ఆయన చెప్పారు. శ్రీవారి లడ్డూ పరిమాణం, బరువు పై అపోహలొద్దంటూ ఇదివరకే టిటిడి వివరణ ఇచ్చింది.

'నిమ్మ' రైతు కంట 'చెమ్మ'

- దారుణంగా పతనమైన ధరలు
- గతంలో కిలో రూ.వంద పలికిన ధర
- రూ.10కూడా గిట్టుబాటు కాని వైనం
- కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్న రైతులు



చెట్టు కింద రాలిన నిమ్మ పండ్లు

ప్రజాశక్తి - బాలాయపల్లి

'మూడు నెలల క్రితం వరకూ బహిరంగ మార్కెట్లో నిమ్మకాయ ఒకటి 7-8 రూపాయలు పలికిన రోజులు ఉన్నాయి.. అప్పట్లో కిలో నిమ్మ 100-150 రూపాయలు ధర పలికింది. ప్రస్తుతం కిలో నిమ్మకాయలు 10-13 రూపాయలు కూడా ధర పలకడం లేదు. శీతాకాలంలో నిమ్మకాయ వాడకం తక్కువగా ఉంటుందని, పైగా వర్షాలు తోడవడంతో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉందని రైతులు వాపోతున్నారు. మరో మూడు నెలలు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తోటలు కాయలతో కళకళలాడుతున్నా కొనే నాథుడే లేడని వాపోతున్నారు. ధర గిట్టుబాటు కాక రైతులు పొలాల్లోనే కాయలను కోయకుండా వదిలేస్తుండటం గమనార్హం.

నిమ్మకాయల విక్రయానికి రాష్ట్రంలో ప్రధాన మార్కెట్లైన గూడూరు, తెనాలి, ఏలూరు, రాజమండ్రిల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బాలాయపల్లి మండలంలో పదివేల ఎకరాల్లో నిమ్మ సాగు చేస్తున్నారు. ఊళ్లకు ఊళ్లే నిమ్మ సాగుపై ఆధారపడి ఉండడంతో రైతులు ప్రత్యక్షంగా, కూలీలు పరోక్షంగా లబ్ధి పొందుతున్నారు. ఏప్రిల్-జులై నెలల్లో కిలో రూ.100-150 వరకు ధర పలికింది. ప్రస్తుతం చలిగాలులతో వాతావరణం అనుకూలంగా లేక ధర భారీగా పతనమయ్యింది. మరోవైపు వర్షాలకు మంగు తెగులు పట్టి నల్లగా మారిపోతున్నాయి. మరోవైపు పెట్టుబడులు రెట్టింపయ్యాయి.



చెట్టుకు ఉన్న నిమ్మకాయలు

పెట్టిన ఖర్చులు రాలేదు : దుద్ద కృష్ణారెడ్డి, గొల్లపల్లి




ఒక డిక్కీ (50 కిలోలు) నిమ్మకాయలు కోయడానికి ఇద్దరు కూలీలు కావాలి. కూలి, కమిషన్, రవాణా, గోతాం ధర అన్నీ భరించి మార్కెట్‌కు తరలిస్తే రూ.400 రావడం లేదు. ఈ మూడు నెలలు రేటు ఇలాగే ఉంటుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీనికితోడు దీపావళి నుంచి వర్షం పడుతూనే ఉంది. దీంతో ధరలు మరింత పతనమయ్యాయి.

అప్పులు భారం : ముని వెంకటేశ్వర్లు నాయుడు, అంబలపూడి



ఏడు ఎకరాల్లో నిమ్మ సాగు చేస్తున్నాను. పెట్టుబడి రూ.3.5 లక్షలు అయ్యింది. కాయలు అమ్మితే రూ.1.20 లక్షలు కూడా రాలేదు. పెట్టుబడికి చేసిన అప్పులు తీరేలా లేదు. మళ్లీ వచ్చే వేసవిపైనే ఆశలన్నీ పెట్టుకుని ఉన్నా. కనీసం అప్పుడైనా గిట్టుబాటవుతుందేమో చూడాలి.

మంగుతెగులు సమస్య : శిరీష, ఎఒ, బాలాయపల్లి



ఇటీవల కురిసిన వర్షాలకు కాయల్లో నాణ్యత కోల్పోయి ధర రావడం లేదు. కాయకు మంగు తెగులు వల్ల దూర ప్రాంతాల మార్కెట్లకు వెళ్లేలోపు దెబ్బతింటున్నాయి. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో పూత కూడా రావడం లేదు. అయితే రైతులు తొందరపడి విపరీతంగా రసాయన మందులు వాడకూడదు.

ఏపీ ద్రోహి... మోడీ గోబ్యాక్

జిల్లావ్యాప్తంగా వామపక్షాల నిరసనలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి, యంత్రాంగం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసి, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు ఆజ్యం పోస్తున్న మోడీకీ ఆంధ్రాలో పర్యటించే హక్కు లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ ధ్వజమెత్తారు. 'ఆంధ్రా ద్రోహి.. మోడీ గో బ్యాక్.. గోబ్యాక్' అంటూ నినాదాలు చేశారు. శుక్రవారం తిరుపతి నగరంలో నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ జరిగింది. బైరాగిపట్టెడ పద్మావతి పార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ పర్యటనకు వస్తున్న మోడీ 'విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోం' అని, ఏపీకి ప్రత్యేక హోదాను ప్రకటిస్తాం అని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పరోక్షంగా కేంద్ర ప్రభుత్వ పెద్దలతో కలిసి నడుస్తున్నారని, ప్రతిపక్ష పార్టీలన్నీ ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. ముఖ్యంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈ విషయాన్ని అర్థం చేసుకోకుండా రోడ్‌మ్యాప్ ఇవ్వాలని పదేపదే కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మోడీ అండదండలు లేకుండా రాష్ట్రంలో జగన్ ఒక్కరోజు కూడా పాలన సాగించలేరని విమర్శించారు. రెండు రోజుల పాటు జరిగే నిరసనలకు టిడిపి నేతలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, నాయకులు వేణు, మాధవ్, మునిరామయ్య, అశోక్, అక్బర్, రమేష్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, నాయకులు చిన్నం పెంచలయ్య, కుమార్‌రెడ్డి, రాధాక్రిష్ణ పాల్గొన్నారు.



తిరుపతిలో..

రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన జరిగింది. సిపిఎం సీనియర్ నాయకులు ఒ.వెంకటరమణ, శివానందం, ఎంపిటిసి రాజేశ్వరి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వస్తే 15 సంవత్సరాలు ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలను ప్రత్యేక ప్యాకేజీ ద్వారా నిధులిచ్చి కడప ఉక్కు, రైల్వేజోన్, దుగ్గరాజపట్నం పోర్టు, పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తామని హామీ ఇచ్చి బడ్జెట్లో నిధులు కేటాయించకుండా చేతులెత్తేశారన్నారు. సత్యశ్రీ, దిలీప్‌బాషా, చార్లీలయ్య, సరస్వతి, కుప్పస్వామి పాల్గొన్నారు.

పాకాలలో కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కలికిరి నారాయణ స్వామి ఆధ్వర్యంలో మోడీ గో బ్యాక్ అంటూ నిరసన తెలిపారు. ప్రత్యేక హోదా కావాలని నిరసన తెలపాల్సిన వైఎస్ఆర్ కాంగ్రెస్ ఫ్లెక్సీలతో స్వాగతం పలకడం దేనికి సంకేతమ ఓన్నారు. కాంగ్రెస్ నాయకులు ఉదయ్‌కుమార్, శంకర్, ఆంజనేయులు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మోడీకి జగన్ స్వాగతం పలకడం సిగ్గుచేటు : కె.రామకృష్ణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి హోదా ఇవ్వకుండా తీరని ద్రోహం చేసిన ప్రధాని మోడీకి జగన్ సాగిల పడి స్వాగతం పలకడం సిగ్గుచేటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. బైరాగిపట్టెడలోని సిపిఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ దారిద్ర్యంలో ఇండియా మొదటిస్థానంలో నిలిచిందంటే మోడీ పాలన ఎంత దుర్మార్గంగా ఉందో తేటతెల్లం అవుతుందన్నారు. మతోన్మాదులను తరిమికొట్టాలన్నారు.



పాకాలలో..



రేణిగుంటలో..

జోరువానలోనూ ఎంపిపి మోహిత్‌రెడ్డి పాదయాత్ర



ప్రజాశక్తి - క్యాంపస్ :కులాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పద్మావతీపురం పంచాయతీలో గడప గడప మహా పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. తుపాను హెచ్చరికలను సైతం లెక్కచేయకుండా ఎంపీపీ మోహిత్ రెడ్డి జోరువానలోనూ ఇంటింటికి పర్యటించారు. ఏదేని సమస్యలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. మీకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ వాకబు చేశారు. పాదయాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. పిల్లనగ్రోవి సాంస్కృతిక ప్రదర్శన, చెక్క భజనలు, బాణసంచా మోతలతో గడప గడప కార్యక్రమం పండుగ వాతావరణం నెలకొంది. ప్రభుత్వ పథకాల అమలులో చోటుచేసుకున్న అవాంతరాలను ఎంపీపీ మోహిత్ రెడ్డి ఎంపిడిఓ వెంకట నారాయణతో మాట్లాడి అప్పటికప్పుడే పరిష్కారానికి కృషి చేశారు. ప్రజలతో అప్యాయంగా పలకరిస్తూ.. మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, సర్పంచ్ గరికపాటి జ్యోతి రాజేంద్ర, ఉప సర్పంచ్ రాజ్యలక్ష్మి, డివిజన్ అధ్యక్షులు మహీదర్ రెడ్డి, ఎంపీటీసీ , మాజీ సర్పంచ్ గణపతి నాయుడు, మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ శ్రీ విద్యా తదితరులు పాల్గొన్నారు.

పంది మాంసం ఉత్పత్తులపై సదస్సు

క్యాంపస్ :శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలోని పశు వైద్య కళాశాల ఆధ్వర్యంలో జాతీయ మాంస పరిశోధన సంస్థ వారి ఆర్థిక సహకారంతో రైతులకు స్వచ్ఛమైన పంది మాంసము ఉత్పత్తి ఆధునిక సాంకేతికత మరియు శాస్త్రీయ పద్ధతిలో అనే అంశంపై ఒక్కరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యవక్త, విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. వెంకట నాయుడు మాట్లాడుతూ పందుల పెంపకంలో, వాటి మార్కెటింగ్ లో ఆధునిక శాస్త్రీయ పద్ధతులను అవలంబించుట వలన రైతులకు చక్కటి ఆదాయం సమకూరుతుందని వెల్లడించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రైతులకు పందుల యాజమాన్య పద్ధతులు పోషణ, ఆరోగ్య సంరక్షణ, శాస్త్రీయ మాంసం ఉత్పత్తి, విలువ ఆధారిత మాంసపు ఉత్పత్తులు తయారీ, పందుల దాణా తయారీ, జినోటిక్ వ్యాధుల నివారణ ఆదాయ వ్యయ మార్గాల గురించి శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమం సమన్వయకర్తలుగా డాక్టర్ కె. సుధీర్, డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, డాక్టర్ నవీన్, డాక్టర్ వెంకటేశ్వర్లు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పరిశోధనా సంచాలకులు డాక్టర్ సర్జన్ రెడ్డి, డీన్ డాక్టర్ బ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ డాక్టర్ ఆదిలక్ష్మమ్మ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి : డిఇఒ భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థినులు ఇంటర్మీడియట్ చదివే వయసులో ఎటువంటి చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతంగా రాణించాలని తిరుమల తిరుపతి దేవస్థానం డీఈవో డాక్టర్ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థి సంఘం ఎన్నిక కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థి సంఘ ప్రారంభోత్సవానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి భువనేశ్వరి దేవి అధ్యక్షత వహించి, అతిధులతో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ప్రారంభించి, తొలి పలుకులు పలుకుతూ గౌరవ అతిథిగా విచ్చేసిన తిరుమల తిరుపతి దేవస్థానం విద్యాధికారి డాక్టర్ ఎం భాస్కర్ రెడ్డిని ఆహ్వానించి, కళాశాలలోని పలు అభివద్ధి కార్యక్రమాలను గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మంచిని పది మందికి తెలియజేయాలని, చెడుని చెవిలో చెప్పుకోవాలని యుక్త వయసులో మీరు చాలా జాగ్రత్తగా ఉండి మంచిగా చదువుకోవాలన్నారు. అనుమానాలను తరిమికొట్టి బలహీనతను వదిలిపెట్టి, అవకాశాలు అంది పుచ్చుకోవాలని అభిలషించారు. డాక్టర్ ఎం.ప్రేమావతి, డాక్టర్ వేదవతి, పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహదేవమ్మ, డాక్టర్ ఉమాదేవి పాల్గొన్నారు.

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో...

బలమైన రాజకీయ శక్తిగా ఆర్‌పిఐ

సౌత్ ఇండియా సదస్సులో వక్తల ఉద్ఘాటన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో బలమైన రాజకీయ శక్తిగా రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ను పటిష్ఠ పరస్తామని నాయకులు ఉద్ఘట్టించారు. స్థానిక ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్లో ఆర్పిఐ దక్షిణ భారత రాష్ట్రాల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆర్పిఐ దక్షిణ భారత అధ్యక్షులు పూతలపట్టు అంజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కులవర్గ నిర్మూలనతోనే సమ సమాజ నిర్మాణం జరుగుతుందని సూచించారన్నారు. సహజ వనరులు అన్ని కులాలు, వర్గాలకు సమాన అవకాశాలు రావడానికి భూమిని, పరిశ్రమలను జాతీయం చేయాలని తెలిపారు. అది రాజ్యాధికారంతోనే సాధ్యమవుతుందన్నారు.



రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియాను అంబేద్కర్ స్థాపించి బలమైన రాజకీయ సిద్ధాంతాన్ని దేశ పీడిత ప్రజలకు అందించారన్నారు ఆయన స్ఫూర్తితో ముందుకెళ్తామని పిలుపునిచ్చారు. రాబోవు ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్లో 175 నియోజకవర్గాల్లోనూ పోటీ చేస్తామని, దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఆర్పిఐ పోటీ చేస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు దీపక్ బహు నికిల్ జి, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్లాల్ పటేల్, జాతీయ ఉపాధ్యక్షులు బొడ్డు కళ్యాణ్ రావు, జాతీయ కార్యదర్శి ప్రకాష్, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు సాదే డేవిడ్, తెలంగాణ అధ్యక్షులు హరీష్ హుస్సేన్, కర్ణాటక అధ్యక్షులు ఏబి హొస్మాని, తమిళనాడు అధ్యక్షులు కష్ణకుమార్, పాండిచ్చేరి అధ్యక్షులు ప్రసన్నకుమార్, కేరళ అధ్యక్షులు అమిద్ ఖాన్, సౌత్ ఇండియా అధ్యక్షులు పి అంజయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ట వరప్రసాద్, కోశాధికారి పూర్ణిమ, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగమల్లి రాజు, కోస్తా ప్రాంతం ఇంచార్జి మేక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు భారీ వర్షాలు

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బంగాళా ఖాతంలో అల్పపీడన ప్రభావం 11, 12 తేదీల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అప్రమత్తం చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ : 0877-2236004 ఏర్పాటు చేసి 24 గంటలు పని చేసే విధంగా సిబ్బందికి డ్యూటీలు వేశామని తెలిపారు. తీర ప్రాంత మండలాలైన తడ, సూళ్లూరుపేట, వాకాడు, కోట, చిల్లకూరు మండలాల్లో ప్రజలు, అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. నష్టం నివారించడానికి, ఎలాంటి సంఘటననైనా ఎదుర్కోడానికి అధికారులు సన్నద్ధంగా ఉండి పర్యవేక్షించాలన్నారు. కెవిబిపురం మండలంలో నివాసం ఉంటున్న ప్రజలందరూ తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎగువపూడి కాజ్‌వే, కోవనూరు కాజ్‌వేను పరిశీలించారు. నారు మళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



విద్యాసంస్థలు విజ్ఞానాన్ని పంచుకోవాలి

గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పిలుపు

వేడుకగా మహిళా వర్సిటీ స్నాతకోత్సవం

108 మందికి గోల్డ్‌మెడల్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్

'ప్రపంచంలోనే ఆధునిక శక్తిగా భారత్ అవతరించింది... ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలు తమ విజ్ఞానాన్ని ఒకరికొకరు పంచుకోవాలి' అని గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ పిలుపునిచ్చారు. డిగ్రీలు పొందిన విద్యార్థులు దేశ సేవలో భాగస్వాములు కావాలన్నారు. మహిళా వర్సిటీ 19, 20వ స్నాతకోత్సవం ఇందిర ప్రియదర్శిని ఆడిటోరియంలో శుక్రవారం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ కూచిపూడి నాట్యకారిణి డాక్టర్ పద్మజారెడ్డి డాక్టరేట్‌ను గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నారు. 108 మంది విద్యార్థులు గోల్డ్‌మెడల్‌ను అందుకున్నారు. గవర్నర్ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ఉన్నత విద్యాసంస్థలు మెరుగైన విద్యా విజ్ఞానాన్ని అందించడానికి కృషి చేయాలన్నారు. ఉమ్మడి బోధన, వర్చువల్ లర్నింగ్, ఉపన్యాసాలు ద్వారా ప్రపంచవ్యాప్తంగా విద్యా సంస్థల మధ్య విజ్ఞానాన్ని పంచుకోవాలని, అధ్యాపకులు కొత్త పద్ధతులలో బోధనలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.





అన్ని రంగాల్లో ముందంజ : వీసీ ఆచార్య దువ్వూరు జమున

రాష్ట్రంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అకాడమిక్, పరిశోధన, బోధన, ఇతర అన్ని రంగాలలో ముందంజలో అభివద్ధి పథంలో దూసుకుపోతుందని ఉప కులపతి ఆచార్య దువ్వూరు జమున పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నుంచి ఆరు వేలకు మందికి పైగా విద్యను అభ్యసించి ప్రపంచవ్యాప్తంగా ఉన్నత స్థాయిలలో ఉన్నారనడానికి గర్వకారణంగా ఉందని అన్నారు. డిగ్రీ పట్టా చేత బట్టుకుని బాహ్య ప్రపంచంలోకి వెళుతున్న విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో దేశ సేవలో భాగస్వాములు కావాలన్నారు. వివిధ యూనిర్సిటీలు, విద్యాసంస్థలతో భాగస్వాములై విద్య, విజ్ఞానంలో పురోగతిలో ఉన్నామని, 27 డిపార్టుమెంట్లు, 34 యుజి, పిజి కోర్సులను అందిస్తున్నామన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా 108 మందికి గోల్డ్‌మెడల్స్, 1902 మందికి డిగ్రీ పట్టాలను అందిస్తున్నామన్నారు. ఈ స్నాతకోత్సవంలో రిజిస్ట్రార్ డిఎం మమలత, వర్సిటీ డీన్లు డాక్టర్ నాగరాజు, డాక్టర్ రామకృష్ణారావు, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ఉమా మహేశ్వరి, డైరెక్టర్లు డాక్టర్ సారా సరోజిని, డాక్టర్ మధుజ్యోతి, డాక్టర్ ఉమ, డాక్టర్ దుర్గా భవాని, డాక్టర్ శిరీష, పిఆర్ఒ డాక్టర్ శ్రీరజిని పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమించి ప్రదర్శనలు : డాక్టర్ పద్మజారెడ్డి

గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న డాక్టర్ పద్మజారెడ్డి మాట్లాడుతూ ఎన్నో సవాళ్లను అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చానన్నారు. ఆరేళ్ల వయస్సులోనే కూచిపూడి నేర్చుకుని 50 సంవత్సరాలుగా వంద దేశాలు పైగా మూడువేల కార్యక్రమాలు చేపట్టానన్నారు. తన స్వస్థలం కూచిపూడి గ్రామమని, ప్రణవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ సంస్థ ద్వారా వేలాదిమందికి నాట్యంలో శిక్షణ అందించానని, నేడు గౌరవ డాక్టరేట్ అందుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. విద్యార్థులు పట్టుదలతో సమాజ సేవలో రాణించాలన్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం, వీడ్కోలు

శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో జరగనున్న స్నాతకోత్సవానికి విచ్చేసిన గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం లభించింది. ఉదయం 11.35 గంటలకు విచ్చేసిన గవర్నర్, మధ్యాహ్నం 3.30కు బయల్దేరి వెళ్లారు. కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, జేసీ డికె బాలాజీ, కమిషనర్ అనుపమ అంజలి తదితరులు స్వాగత కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్థిక శాస్త్ర విద్యార్థి సాత్వికకు గోల్డ్ మెడల్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఆర్థిక శాస్త్రం విభాగపు విద్యార్థి 2022వ సంవత్సరానికి గాను కె.సాత్వికకు గోల్డ్ మెడల్ లభించింది. తిరుపతి సమీపంలోని చంద్రగిరి మండలానికి చెందిన చిన్న రామాపురంలోని సాధారణ రైతు కుటుంబానికి చెందిన కె.అనిత, కె. సుధాకర్ రెడ్డి ల మొదటి కుమార్తె సాత్విక. చిన్నప్పటి నుంచి చదువులో విశేషంగా రాణిస్తూ ఉంది. శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీలో పదో తరగతి, ఎమరాల్డ్స్‌లో ఇంటర్ చదివింది. డాక్టర్ పి.మాధవి మార్గదర్శకంలో మహిళా వర్సిటీలో పరిశోధకురాలుగా చేరింది. ఈ సందర్భంగా ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ భవిష్యత్తులో ఆర్థిక శాస్త్ర నిపుణురాలుగా, ఆర్థిక శాస్త్ర ఆచార్యులుగా రాణించాలని తన ఆశయంగా, లక్ష్యంగా పేర్కొంది.

ఎలమంచిలి ప్రీతికి బంగారు పతకం

న్యాయ శాస్త్ర విభాగంలో ఎల్.ఎల్.బి పూర్తి చేసి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎలమంచిలి ప్రీతికి రాష్ట్ర గవర్నర్ విశ్వ భూషణ్ హరి చందన్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఆమె తండ్రి, ప్రముఖ నిర్మాత ఎలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి సహజంగానే ప్రతిభ కలిగిన ప్రీతి న్యాయ శాస్త్ర మాస్టర్ డిగ్రీ, బంగారు పతకం సాధించడం సంతోషకరమన్నారు. ఈ ప్రతిభతో పలువురు పేదలకు న్యాయ సలహాలు, దళిత నిరక్షరాశుల పట్ల సేవాభావంతో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. డాక్టర్ మధు హరీష్, ఎమ్ ఆర్ ఎన్ వర్మ తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



నగరంలో పచ్చదనం పెంచుదాం : కమిషనర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో పచ్చదనం పెంచి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని కమిషనర్ అనుపమ అంజలి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలోని అన్నమయ్య మార్గ్, లక్ష్మీపురం కూడలి, ఎయిర్ బైపాస్ రోడ్డు, మహిళా యూనివర్సిటీ రోడ్డు, రాళ్ళపల్లి కూడలి తదితర ప్రాంతాల్లో గ్రీనరీని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రీన్ సిటీ ఛాలెంజ్ లో భాగంగా నగరంలో వీలున్న ప్రతి చోట మొక్కలు పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అన్ని డివైడర్ల మధ్యలో, కూడళ్లలో రంగురంగుల పూలమొక్కలు నాటాలన్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా నీడనిచ్చే చెట్లను నాటాలన్నారు. మొక్కలు నాటడమే కాదు వాటిని బాధ్యతగా పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డి.ఈ లు సంజయ్ కుమార్, దేవిక ఉన్నారు.

గహ ప్రవేశాలకు సిద్ధం చేయండి

జగనన్న కాలనీల్లో నిర్మాణాలు పూర్తయిన ఇండ్లను గహ ప్రవేశాలు చేయించేందుకు సిద్ధం చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్ణయించామని ఈ మేరకు అధికారులు జగనన్న కాలనీలు సందర్శించి పురోగతిని తెలుసుకుని పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యకార్యదర్శి ఆదేశించారన్నారు. శుక్రవారం ఏర్పేడు మండలం చిందేపల్లిలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. కమిషనర్ వెంట డిఈ గోమతి, హౌసింగ్, ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.

అమరావతే రాజధానిగా ఉండాలి : టిడిపి

తిరుపతి టౌన్ : రాష్ట్ర రాజధానిగా అమరావతినే కొనసాగించాలని, మూడు రాజధానులు అవసరం లేదని టిడిపి మాజీ ఎంఎల్ఎ ఎం.సుగుణమ్మ ఆధ్వర్యంలో గవర్నర్‌కు వాట్సాప్ ద్వారా వినతిపత్రం అందించారు. నగరంలో కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా సుగుణమ్మ మాట్లాడుతూ అమరావతి రాజధానిగా కొనసాగించాలని 2014లో వైసిపి మద్దతు తెలిపిందని గుర్తు చేశారు. టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, నగర కార్యదర్శి చినబాబు, శ్రీధర్‌వర్మ, సూరా సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్ ఆర్‌సి మునిక్రిష్ణ పాల్గొన్నారు.

హాటు కేకుల్లా అమ్ముడైన శ్రీవారి దర్శన టికెట్లు

తిరుమల : శుక్రవారం ఉదయం టిటిడి విడుదల చేసిన దర్శన టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. ఉదయం 10 గంటలకు శ్రీవారి దర్శన టికెట్లు విడుదల చేయగా 80 నిమిషాల్లో 5,06,600 టికెట్లను భక్తులు బుక్ చేసుకున్నారు. జియో మార్ట్ క్లౌడ్ టెక్నాలజీ సహకారంతో భక్తులకు ఎలాంటి అంతరాయం కలగ లేదని టిటిడి పేర్కొంది. రూ.300 దర్శన టికెట్ల విక్రయం ద్వారా టిటిడికి రూ.15.20 కోట్ల ఆదాయం లభించింది.

ఆ రెండు శవాలెవరివో తేల్చండి : బొజ్జల సుధీర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : బాధితులు, ప్రజల పక్షాన పోరాడితే తమవి శవ రాజకీయాలంటూ ఎదురు దాడి చేస్తున్న అధికార పార్టీ ఇటీవల శ్రీకాళహస్తి సమీపంలో లభ్యమైన ఆడ, మగ శవాలెవరివో గుట్టు తేల్చాలని టిడిపి శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాపక్షాన పోరాడినందుకు బహుమతిగా 30 మంది ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం శ్రీకాళహస్తి నియోజకవర్గ 70 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎన్నడూ చూడలేదని వాపోయారు. స్థానిక ఎన్టీఆర్ భవన్ లో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ బిడ్డకు న్యాయం చేయమని చంద్రిత తల్లిదండ్రులు టిడిపిని ఆశ్రయిస్తే వారి తరపున కేసు నమోదు చేయమని పోలీసులను అభ్యర్థించినట్టుగా తెలిపారు. అయితే టిడిపి కార్యకర్తలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో అనుచితంగా ప్రవర్తించారంటూ 19 మంది పై దొమ్మీ కేసులు పెట్టడం దురదష్టకరమన్నారు. అదేవిధంగా చంద్రశేఖర్ తల్లిదండ్రులను కులం పేరుతో వేధించారంటూ చంద్రిత తల్లిదండ్రులతో పాటు మరో 12 మంది టీడీపీ కార్యకర్తలపై ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. పై రెండు అక్రమ కేసుల్లో వారం రోజుల్లోనే హై కోర్టు బెయిల్ ఇవ్వడం, 41(ఏ) నోటీసు జారీ చేయడం ప్రజాస్వామ్యం ఇంకా బతికే ఉందనేదానికి నిదర్శనమన్నారు. పెళ్ళై పిల్లలున్న వ్యక్తి ఓ మైనర్ బాలికను ఏడాది పాటు తన వద్ద ఉంచుకుంటే ఇంతవరకు అతడిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. నిందితుడికి పోలీసులు, స్థానిక ఎమ్మెల్యే మద్దతిస్తున్నారా? అని ప్రశ్నించారు. అధికార పార్టీ ఎన్ని అక్రమకేసులు పెట్టినా జడిసేది లేదనీ, మరింత దూకుడుగా ప్రజాక్షేత్రంలో పోరాడతామని స్పష్టం చేశారు. రెడ్డివారి గురువారెడ్డి, దశరథాచారి, రవి, చలపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.





శ్రీకాళహస్తి-పల్లం రోడ్డును విస్తరించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి-పల్లం రోడ్డును విస్తరించాలని ఆ ప్రాంత రైతులు, ప్రజలు శుక్రవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి-పల్లం రోడ్డు వెంకటగిరి ప్రధాన మార్గాన్ని కలుపుతూ సుమారు 16 కిలోమీటర్ల పొడవు ఉందని చెప్పారు. విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, పాదచారులు, వాహనచోదకులు నిత్యం రాకపోకలు సాగిస్తుండడం వల్ల ఈ మార్గం రద్దీగా ఉంటుందని తెలియజేశారు. సింగిల్ రోడ్డు కావడంతో నిత్యం ప్రమాదాలు కూడా జరుగుతున్నాయనీ, వెంటనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే రోడ్డును విస్తరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

యూనియన్ బ్యాంక్ 104వ వ్యవస్థాపక దినోత్సవం



ప్రజాశక్తి - పాకాల: మండలంలోని దామలచెరువు యూనియన్ బ్యాంక్ 104వ వ్యవస్థాపక దినోత్సవం ఖాతాదారుల, సిబ్బంది సమక్షంలో ఘనంగా నిర్వహించామని దామలచెరువు యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎన్.చంద్రశేఖర్ శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఖాతాదారులకు సిబ్బందికి పంచిపెట్టారు. ఖాతాదారులు యూనియన్ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకల్లా జగనన్న ఇళ్లు పూర్తి చేయండి

ఎంపీడీవో సింగయ్య



ప్రజాశక్తి-దొరవారిసత్రం: నవంబర్ నెలాఖరిలోపు జగనన్న కాలనీ ఇళ్లు పూర్తి చేయండంటూ స్థానిక ఎంపీడీవో సింగయ్య అన్నారు. ఆయన శుక్రవారం నెలబల్లి సచివాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్లు సత్వరమే పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని వాలంటీర్లను కోరారు. పూర్తి చేసుకున్న ఇళ్లకు మంచినీటి కొళాయి, విద్యుత్ కనెక్షన్ ఉచితంగా కల్పించబడుతుందని తెలియజేశారు. స్లాబ్ లెవెల్ వరకు నిర్మించుకున్న వారికి పూర్తిగా తిరిగి చెల్లించు ప్రాతిపదికపై రూ. 35వేలు పొదుపు సంఘాల ద్వారా బ్యాంక్ రుణం మంజూరు చేయించడం జరుగుతుందని తెలియజేశారు. సచివాలయ సిబ్బంది, ఏపిఎం పద్మావతి, సీసీ నారాయణ పాల్గొన్నారు.

శివాలయంలో ఫ్లోరింగ్ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పట్టణంలోని శ్రీకామాక్షి సమేత శ్రీసదాశివేశ్వర ఆలయం ఆవరణంలో ఫ్లోరింగ్ పనుల ఆధునీ కరణకు శుక్రవారం ఉదయం భూమి పూజ నిర్వహించారు.



ఫ్లోరింగ్ పనుల ఆధునీకరణ గాను ఆడిటర్ గజేంద్ర, సోమశేఖర్, ఎల్‌జి రవి, మిత్రబృందం ఆధ్వర్యంలో సుమారు రూ.6 లక్షల వ్యయంతో పనుల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొడగంటి రమేష్ బాబు, కమిటీ సభ్యులు యమహా రమేష్, విజయలక్ష్మి, సుందరం, మునిసిపల్ ఛైర్మన్ గెడ్డం అనంగి హరి తదితరులు పాల్గొన్నారు.


లక్ష్యంతో ముందుకు సాగితే విజయం తథ్యం

ప్రజాశక్తి-గూడూరు రూరల్: ఓ లక్ష్యంతో ముందుకు సాగితే విజయం తథ్యమని గూడూరు అడిషనల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ పి.లోకనాథం అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా గూడూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్ర వారం గూడూరులోని సెయింట్ మేరీస్ జూనియర్ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష సాధనతో ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఏదో ఒక రంగంలో గుర్తింపు తెచ్చుకునేలా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మహబూబ్ భాషా, అరవ పార్వతయ్య, పీఎల్‌వీ జి.రామసుబ్బయ్య, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాకు తెలియకుండానే... భూ రికార్డులు మార్చేశారు: చుక్కా గోపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గడచిన 60 సంవత్సరాలుగా తమ ఆధీనంలోని భూమిని మాత్రమే జన్మభూమి కమిటీల సిఫార్సు మేరకు 2015లో అప్పటి తహశీల్దార్ కులశేఖర్, వీఆర్వోలు వెంకటయ్య, బాబునాయుడు కలిసి సుశీలమ్మ పేరుపై మార్చేశారని భూ పట్టాదారుడు చుక్కా లక్ష్మయ్య, కుటుంబీకుడు చుక్కా గోపి ఆరోపించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయమై ప్రస్తుత తహశీల్దార్ రోశయ్యకు విన్నవించగా వెంటనే నేల చదునుకు ఉపయోగిస్తున్న ట్రాక్టర్ను సీజ్ చేయాలని ఆదేశించారన్నారు. మండల తహశీలార్ ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తూ దగ్గరుండి విఆర్ఒ బాబునాయుడు భూమిని చదును చేయిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



ప్రజాశక్తి-గూడూరు, గూడూరు రూరల్: గూడూరులోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో స్వాతంత్ర్య సమర యోధులు భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రి భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతి వేడుకలను శుక్రవారం మహమ్మదియన్ వెల్ఫేర్ నెట్ వర్క్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాసయ్యద్ అబ్దుల్ హమీద్ ఏయస్ పేట ప్రధానోపాధ్యాయులు రచించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ది పాత్ ఫైండర్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు అనంతరం వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నెట్ వర్క్ ప్రతినిధుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మదియన్ వెల్ఫేర్ నెట్ వర్క్ గౌరవ అధ్యక్షులు లయన్ షేక్ రియాజ్ అహ్మద్,సలహాదారులు మగ్దూమ్,అబ్దుల్ రహీం, రవూఫ్, అన్వర్, కార్యదర్శి షాణ్వాజ్, అప్సర కరిముల్లా, అహ్మద్, జీలాని, గోల్డ్ నాజర్, బాబు, సాదిక్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పుత్తూరుటౌన్: చదువుకున్న వ్యక్తి దేశానికి శక్తి అని ప్రధానోపాధ్యాయులు వెంకమ రాజు పేర్కొన్నారు. శుక్రవారం హనుమాన్ పేట మండలం గంధపు హరిజనవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవ నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయురాలు. విజయలక్ష్మి అంగన్వాడీ కార్యకర్త మహాలక్ష్మి. విద్యార్థులు పాల్గొన్నారు.


రేణిగుంట: పట్టణంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ ఆవరణలో వే ఫౌండేషన్ వారి సమక్షంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ విగ్రహాన్ని బియ్యపు పవిత్ర రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హరి ప్రసాద్ రెడ్డి సుజాత సర్పంచ్ నగేష్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ హెడ్మాస్టర్ ప్రసాద్ దయాకర్ రెడ్డి తదితర మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు



తిరుపతి(మంగళం): స్థానిక బైరాగి పట్టెడలోని మహాత్మా గాంధీ నగరపాలక ఉన్న పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రాజు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రభాకర్ రాజు మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి జరుగుతుందని తద్వారా భవిష్యత్తులో గొప్ప స్థానాలకు చేరుకునే అవకాశాలను ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూదన్ రెడ్డి, మునిశారద, రవికుమార్, మురుగన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జగనన్న క్రీడా సంబరాలు ప్రారంభం



గూడూరులో..

ప్రజాశక్తి-గూడూరు, గూడూరు రూరల్ : గూడూరు నియోజకవర్గ జగనన్న క్రీడా సంబరాలను గూడూరు శాసనసభ్యులు వెలగపల్లి వరప్రసాద్ రావు స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో శుక్రవారం ప్రారంభించారు. నియోజకవర్గ స్పోర్ట్స్ కన్వీనర్ పి.కరీముల్లా ఖాన్ ఆధ్వర్యంలో ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాలలో జరిగిన ఎంపికలలో నియోజకవర్గం నుండి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, బత్తిని విజయకుమార్, మైనారిటీ నాయకులు అజీజ్ ఖాన్, గూడూరు ఉపవిద్యాశాఖాధికారి యు.శివప్రకాష్ రెడ్డి, ఎంఈవో దేవరాజుల రెడ్డి, వ్యాయామవిద్య ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, సురేష్, రమేష్, సందాని బాషా, సుబ్బయ్య, విజయలక్ష్మి, విజయ, కామేశ్వరి, లాలీప్రవీణ, మహిపతి, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాలెం: జగనన్న క్రీడా సంబరాలలో భాగంగా శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో సెలక్షన్స్ టోర్నమెంట్‌ను వరదయ్యపాలెంలోని విజ్ఞాన జ్యోతి స్కూల్ లో లాంఛనంగా సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజక వర్గంలోని ఏడు మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని నియోజకవర్గస్థాయిలో బెస్ట్ టీంని సెలెక్ట్ చేసి జిల్లా, రాష్ట్ర స్థాయికి పంపించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జరిగే టోర్న మెం ట్లో సీఎం చేతుల మీదుగా కప్పును అందిస్తారని దీంతో నైపుణ్యమున్న క్రీడాకారులు వెలుగులోకి వస్తారని నిర్వా హకులు తెలిపారు. ఎంపిపి పద్మ ప్రియ, వ్యాయమ ఉపాధ్యాయులు మండల వైసిపి నాయకులు పాల్గొన్నారు.



వరదయ్యపాలెంలో..

ప్రజావసరాలు తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం

-ఎమ్మెల్యే వరప్రసాదరావు

ప్రజాశక్తి-గూడూరు: అర్హులైన ప్రజల అవసరాలను గుర్తించి పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ధ్యేయమని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వరప్రసాద్ రావు పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు మున్సిపాలిటీ రెండో పట్టణంలోని దివి పాలెం-2 గ్రామ సచివాలయ పరిధిలో ఇందిరమ్మ కాలనీ, ప్రశాంతి నగర్ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో నిర్లక్ష్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే 39 మంది వాలంటీర్లు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని కమిషనర్ సాయినాథ్‌ను ఆదేశించారు. ఇందిరమ్మ కాలనీలో కొందరు ఆకతాయిలు, రౌడీలు రాత్రి వేళల్లో, ప్రజలకు అశాంతి, అసౌకర్యం కలిగిస్తున్నారని, రాత్రి వేళల్లో తిరగడం భయంగా ఉందని ఎమ్మెల్యే వరప్రసాద్ రావుకి తెలియజేశారు. గూడూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు మాట్లాడుతూ వెంటనే అటువంటి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి, అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని హామీఇచ్చారు. వైసిపి నాయకులు శ్రీధర్ రెడ్డి, మనుబోలు కృష్ణయ్య, సన్నీ బోయిన మహేంద్ర యాదవ్, ఎస్సీ నాయకులు ఎన్వి రమణయ్య, బీసీ నాయకులు రమేష్ యాదవ్, రమాదేవి, వైసీపీ కార్యకర్తలు, అభిమానులు, మున్సిపల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వరదయ్యపాలెం : మండలంలోని చెన్నవారిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం ఇంటింటికీ పర్యటిస్తూ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసీపీ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ఎంపీపీ పద్మప్రియ దామోదర్ రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ హరిరెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామల, ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచులు బొప్పన తిలక్ బాబు, కవిత వేణు సర్పంచులు అధికారులు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి -రేణిగుంట: పంచాయతీలోని సిబిఐడి కాలనీలో రోడ్ కావాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరగా తక్షణం స్పందించి అక్కడున్న అధికారులతో మాట్లాడి వెంటనే సీసీ రోడ్డు వేయవలసిందిగా ఆదేశించారు. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి ఆదేశాలు మేరకు రూ. 6 లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డుకు రేణిగుంట మండల ఇన్‌ఛార్జి పవిత్ర రెడ్డి భూమి పూజ చేసారు. రేణిగుంట మండల వైసీపీ నాయకులు హరి ప్రసాద్ రెడ్డి, దయాకర్ రెడ్డి, సర్పంచ్ నగేష్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఉపసర్పంచ్ ఇర్ఫాన్, సుభాన్ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ ఆర్టీసీ సేవలు

ప్రజాశక్తి-గూడూరు: వైయస్ జగన్మోహన్ రెడ్డి నిర్ణయంతో ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ప్రతి గ్రామానికి ఆర్టీసీ సేవలు అందుబాటులోకి వచ్చాయని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ రావు అన్నారు. శుక్రవారం గూడూరు ఆర్టిసి డిపో ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభించిన గూడూరు - నెల్లూరు అల్ట్రా పల్లె వెలుగు సర్వీస్‌లో భాగంగా రెండు ఆర్టీసీ బస్సులను ఎమ్మెల్యే వరప్రసాదరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ చెంగల్ రెడ్డి, డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు , వైసీపీ నాయకుడు విజయ్ కుమార్ , ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువకు సిమెంటు పైప్ ఏర్పాటు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రూరల్ మండలంలోని చిరుగు రాజుపాలెం పంచాయతీలో దిగువగుళ్ళురులో మురికి కాలువలో వర్షపు నీరు పోకుండా ఎప్పుడో నిర్మించిన రెండడుగుల లోతులో ఉన్న సిమెంట్ పైపు పూర్తిగా డామేజ్ అయ్యింది. దీంతో శుక్ర వారం గ్రామ సర్పంచ్ మోహన్ మురళి ఆధ్వర్యంలో సిమెంట్ పైపు ఏర్పాటు చేసి మురికి కాలువలో నీళ్ల పోయేలా సౌకర్యంగా చేశారు. అలాగే సీసీ రోడ్లకు మరమ్మతులు చేస్తూ గ్రామ ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశారు. వైస్ సర్పంచ్ జె.మురళి పంచాయతీ కార్యదర్శి హరిత, ఇంజనీర్ అసిస్టెంట్ అనుదీప్, వాలంటీర్లు, గ్రీన్ అంబాసిడర్ గంగయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ స్మృతివనం అభివృద్ధికి సహకరించాలి



ప్రజాశక్తి - నాయుడుపేట: మండలం లోని మేనకూరు సెజ్ ప్రాంతంలో నిర్మిస్తున్న వైఎస్సార్ స్మృతి వనాన్ని జిల్లాలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం కోసం సహకారం అందించాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రా రెడ్డిని, తిరుపతి ఎంపి మద్దెల గురుమూర్తిలను వైసిపి రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్ రెడ్డి కోరారు. శుక్రవారం సాయంత్రం తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి, ఎంపి గురుమూర్తి నివాసాల్లో వారిని కట్టా సుధాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి వైఎస్సార్ స్మృతి వనం రూపొందిస్తున్న ప్రణాళికను వారికి వివరించారు. వైఎస్సార్ స్మృతి వనం నిర్మాణానికి మంత్రి, ఎంపిల సహకారంతో పాటు, ఆర్థిక వనరులు సమకూర్చాలని వారిని కోరారు. స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, ఎంపి గురుమూర్తి ఎంపి నిధులనుండి వైఎస్సార్ స్మృతి వనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపి గురుమూర్తిలకు సుధాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట నాయుడుపేట మాజీ వైస్ ఎంపిపి నల్లు కస్తూరయ్య, ఓజిలి మాజీ జెడ్పిటిసి సభ్యులు ముమ్మడి సుబ్బారావులు వున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక కోర్టు ఆవరణంలో నేడు శనివారం ఉదయం 10 గంటల నుండి జాతీయలోకదాలత్ జరుగుతుందని పుత్తూరు ఇన్‌ఛార్జి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవ అధికారి సంస్థ అధ్యక్షుడు శిరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చని, క్రిమినల్ కేసులు పరిష్కరింబడుతాయని తెలిపారు. కక్షి దారులు ప్రజలు లోకాదళత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



చోరీ కేసులో దొంగ అరెస్టు

ప్రజాశక్తి- తొట్టంబేడు: చోరీ కేసులో పాత నేరస్తుడు పి.వెంకటేష్‌ను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ భాస్కరనాయక్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి పట్టణ రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో గల శ్రీశ్రీ నగర్‌లో నివాసం ఉండే శ్రీధర్ ఆచారి గత నెల 22వ తేదీన కుటుంబ సభ్యులతో కలసి కాశీయాత్ర వెళ్లారు. ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 144గ్రాముల బంగారం... రూ.4లక్షల నగదు తీసుకెళ్లారు. ఈ ఘటనపై భాస్కరనాయక్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు శుక్రవారం పాత నేరస్తుడు వెంకటేష్‌ను శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండు వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ కేసు బయటపడింది. ఈయన వద్ద ఉన్న 115 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన డబ్బును తనతో పాటు దొంగతనానికి వచ్చిన కృష్ణ ఇద్దరు పంచుకుని ఖర్చు చేశారని ఆయన తెలిపాడు. మిగిలిన నగలు, డబ్బు పరారీలో ఉన్న కృష్ణ దగ్గర ఉన్నాయని వెంకటేష్ చెప్పినట్లు సీఐ తెలిపారు. పరారీలో ఉన్న కృష్ణ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈయనను త్వరలో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ప్రజలు దూర ప్రయాణాలకు వెళుతున్నప్పుడు పోలీస్ ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

పంట కాలువ ఆక్రమణ

అడిగిన రైతులపై దుర్భాషలాడిన వైనం



ప్రజాశక్తి- బిఎన్‌కండ్రిగ: మండల కేంద్రంలోని నెలవాయి గ్రామంలో ఎన్నో సంవత్సరాల తరబడి తాము వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని అయితే తమ వ్యవసాయానికి నీరు కోసం పిడబ్ల్యుడి చెరువు నుంచి తమ పంట పొలాలకు వచ్చే పంట కాలవను వెంకటప్ప నాయుడు కుమారుడు మనోహర్ నాయుడు ఆక్రమించుకుని పంట పొలాలకు నీరు రాకపోకలను నిలిపివేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తహశీల్దార్ చంద్రశేఖర్‌నాయుడుకి సర్పంచ్ సుధాకర్‌నాయుడుతో కలసి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతకుముందు కురిసిన వర్షాలకు గాను రైతులందరూ వరినాట్లు నాటుకొని అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టుకొని వ్యవసాయం చేస్తున్న సమయంలో వ్యవసాయానికి భంగం చేయడం, నానా ఇబ్బందుల పాలు చేయడం ఎంతవరకు న్యాయమో అతనికి తెలియాలని గ్రామస్తులు వాపోయారు. అందుకు తిరగబడి అడిగిన వారిపై కులం పేరుతో దుర్భాషలాడుతూ విరుచుకు పడుతున్నాడని, ఈ విషయంపై స్థానిక పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు న్యాయం చేయాలని నెలవాయి రైతులందరూ కోరుతున్నారు.

నరసింహారెడ్డి భార్య మృతి బాధాకరం

బొజ్జల సుధీర్ రెడ్డి



ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాగాలి నరసింహారెడ్డి భార్య పాగాలి విజయలక్ష్మి గత పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ, స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడులు శుక్రవారం విజయలక్ష్మి భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం నరసింహారెడ్డిని ఓదార్చుతూ మీ కుటుంబానికి మేము అండగా ఉంటామని, తెలుగుదేశం పార్టీ మీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విజయలక్ష్మి మరణం పట్ల తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు, మాజీ ఎంపీపీ కోవి పోలమ్మ, మాజీ జెడ్పిటిసి సభ్యులు గాలి అనసూయమ్మ గ్రామ కమిటీ అధ్యక్షులు మోహన్, గురవయ్య, రాఘవయ్య, గిరిబాబు తదితర నాయకులు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి మనోధైర్యంతో ముందుకు కొనసాగాలని కొనియాడారు.